క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండాలి

అలంపూర్ రూరల్: వర్షాలకు మట్టి ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్ సూచించారు. మండలంలోని ర్యాలంపాడ్, సూల్తాన్‌పూర్ గ్రామాల్లో శిథిలావస్థకు చేరిన మట్టి ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు పాత ఇళ్లు మెత్తబడి కూలిపోయే పరిస్థితి ఉందని, శిథిల ఇళ్లల్లో ఎవరూ ఉండొద్దని కోరారు. ప్రజలు సహకరిస్తే సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్‌తో చర్చించినట్లు చెప్పారు. అనంతరం అలంపూర్ జూనియర్ సివిల్‌జడ్జి కమలాపురం కవిత, తహసీల్దార్ సుభాష్ నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ చేయొద్దు



అయిజ: ఆరోగ్యంపై ఎవరూ అశ్రద్ధ చేయొద్దని ఆయుష్ డాక్టర్ శిల్ప సూచించారు. పట్టణంలోని 19వ వార్డులో సోమవారం ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మోకాళ్ల నొప్పులు, చర్మ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ మోకాళ్ల నొప్పులు ఉన్న వారు ఇంగ్లిష్ మందులను ఎక్కువగా వాడరాదని, ఆయుర్వేదానికి సంబంధించిన మందులను వైద్యుల సూచన మేరకు తీసుకోవాలని సూచించారు. చర్మవ్యాధులపై నిర్లక్ష్యం చేయొద్దని, ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి తగిన మందులను తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పుష్ప, భాగ్యమ్మ, ఆశ కార్యకర్తలు శివమ్మ, పల్లవి పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం



శాంతినగర్: మండల ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నరేష్‌ను సోమవారం బీఎస్పీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎంసీ కేశవరావు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రవిచందర్, సీఆర్ఓ చంద్రశేఖర్, కన్వీనర్ జలంధర్, లక్ష్మన్న, నాగేష్, విజయ్, లోకన్న తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం



అలంపూర్ రూరల్: మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్ల మధ్య నిలిచిన నీటిని తొలగించడంతోపాటు మురుగుకాల్వలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ప్రతి మొక్కను సంరక్షించాలి



కేటీదొడ్డి: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ మహ్మద్ అజార్ మొహినుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో కమ్యూనిటీ ప్లాంటేషన్ ఏర్పాటు కోసం తీసిన గుంతలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేయాలని సర్పంచుకు సూచించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి రంగన్న, ఏఈఓ కుమార్ ఉన్నారు.

పత్తిపంట పరిశీలన



మానవపాడు: మండలంలోని కలుకుంట్ల శివారులో సాగు చేసిన పత్తిపంటను సోమవారం మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపంట సంరక్షణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్లాసులు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వానదారులు

- నీటిగుంటలను తలపిస్తున్న రోడ్లు
- వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



మన్నాపురం- చింతరేవుల మధ్య గుంతలమయంగా మారిన రోడ్డు



చింతరేవుల-జీరుబండ మధ్య ఇలా..

ధరూరు: గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లపై ఏర్పడిన గోతుల్లో వర్షపునీరు చేరడంతో నీటి గుంటలను తలపిస్తున్నాయి. గుంతలమయంగా మారిన రోడ్లపై రాకపోకలు సాగించలేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని మన్నాపురం నుంచి చింతరేవుల మీదుగా జీరుబండకు వెళ్లే బీటీరోడ్డు మరీ అధ్వానంగా మారింది. రోడ్డుపై వర్షపునీరు నిల్వ ఉండడంతో గోతులను గుర్తించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామీణ రహదారులు గుంతలమయంగా మారినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై ఏర్పడిన గోతులను పూడ్చివేసి వర్షపునీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అపరచిత వ్యక్తుల మాటలు నమ్మొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివానందంగౌడ్

ధరూరు: అపరచిత వ్యక్తుల మాటలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని ఎస్ఐ శివానందంగౌడ్ సూచించారు. మండలంలోని గూడెందొడ్డిలో సోమవారం పోలీసు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పాన్‌కార్డు, ఏటీఎం వివరాలను ఎవరికీ ఇవ్వొద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అదేవిధంగా వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని తెలిపారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. బాలికలు, మహిళలను వేధింపులకు గురిచేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రాధమ్మ, కళాబృందం హనుమంతు, కృష్ణ, రామాంజనేయులు, రామిరెడ్డి, శివాని పాల్గొన్నారు.

మొహర్రం వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్

గట్టు: మండలంలోని గొర్లఖాన్‌దొడ్డిలో కొలువుదీరిన మౌలాలి పీరును సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన మౌలాలి పీరు ఊరేగింపులో జెడ్పీ చైర్‌పర్సన్‌తోపాటు కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు మహబూబ్‌పాషా, ఉపసర్పంచ్ ఇమాంఅలీ ఉన్నారు.

కలెక్టర్‌కు వినతి

శాంతినగర్: స్వీపర్లను రెగ్యులరైజ్ చేసి వేతనాలు పెంచాలని కోరుతూ సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రామలింగం మాట్లాడుతూ స్వీపర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నర్సింహులు, ఆనందం, రత్నం, వెంకటేష్, రాముడు, సంజన్న, జానిప్రేమ పాల్గొన్నారు.

బహుజన యాత్రను జయప్రదం చేయాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న బీఎస్పీ నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్రను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు యువరాజు కోరారు. ఇటిక్యాల మండలం మునుగాలలో సోమవారం పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల జీవితాలు బాగుపడాలంటే బీఎస్పీ ఆదరించాలన్నారు. ఆగస్టు 3 నుంచి ఇటిక్యాల, మునుగాల, నక్కలపల్లి, కొత్త దేవరపల్లి, చాగాపురం, వల్లూరు గ్రామాల్లో రెండు రోజుల పాటు యాత్ర కొనసాగుతుందని, బహుజన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్, విజయ్, శేషన్‌కుమార్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

అలంపూర్ రూరల్: పంటల్లో పోషక లోపాలను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ అనిత రైతులకు సూచించారు. మండలంలోని బైరంపల్లి గ్రామశివారులో సోమవారం పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మొక్కజొన్న పంటలో పోషక లోపాలను గుర్తించామని, వ్యవసాయాధికారుల సూచన మేరకు ఎరువులు, మందులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయిరాం పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



అలంపూర్: సమాజానికి అందించే సేవలతోనే గుర్తింపు లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం స్వీపర్ దానమ్మ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆమెను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్ సుదర్శన్‌గౌడ్, మున్సిపల్ అధికారులు షరీఫ్, మద్దిలేటి, నారాయణ, ఆంజనేయులు, వెంకట్రాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన శ్రీశైలం నిర్వాసితులు



ఎమ్మెల్సీ చల్లాతో శ్రీశైలం ముంపు నిర్వాసితులు

అలంపూర్: హైదరాబాద్‌లో సోమవారం ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని శ్రీశైలం ముంపు నిర్వాసితులు కలిశారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంతో అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయని, జీఓ నెంబర్ 98 ప్రకారం నిర్వాసితుల్లోని 36 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఉద్యోగాలు రాలేదని ఎమ్మెల్సీకి వివరించగా, విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

గాలికుంటు వ్యాధిని నిర్మూలిద్దాం

అయిజ: పశువుల్లో గాలికుంటు వ్యాధి నిర్మూలించేందుకు టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపరాణి సోమవారం ప్రకటనలో కోరారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈవీఎంలపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

అలంపూర్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై ఓటర్లందరికీ అవగాహన తప్పనిసరిగా ఉండాలని తహసీల్దార్ సుభాష్‌నాయుడు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమ వారం ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

దుకాణాల్లో తనిఖీ

ధరూరు: మండల కేంద్రంలోని దుకాణ సముదాయాల్లో సోమవారం ఆపరేషన్ ముస్కాన్ బృందం తనిఖీలు చేపట్టింది. బాలకార్మికులను గుర్తించేందుకుగానూ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించినట్లు బృందం సభ్యులు తెలిపారు. బాలలను ఎవరైనా పనుల్లో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పౌరహక్కులను తెలుసుకోవాలి



అడవిర్యాల్‌చెర్వులో మాట్లాడుతున్న ఆర్ఐ నాగిరెడ్డి

మల్దకల్: మండలంలోని అడవిర్యాల్‌చెర్వు గ్రామంలో సోమవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ నాగిరెడ్డి, ఏఎస్ఐ ఈశ్వరయ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా రెండు గ్లాసుల పద్ధతి పాటిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రెన్న పాల్గొన్నారు.

మానవపాడు: పౌరహక్కులపై అందరికీ అవగాహన ఉండాలని ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని నారాయణపురంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందరూ కలిసిమెలసి ఉంటూ సామాజిక అసమానతలను రూపుమాపాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నరేందర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలోని శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సందర్శించి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శివుడికి పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

3 నెమళ్ల అప్పగింత



అలంపూర్ రూరల్: మండలంలోని బైరంపల్లి, ఇమాంపూర్ గ్రామాల సమీపంలో సోమవారం అచేతన స్థితిలో ఉన్న మూడు నెమళ్లను గ్రామస్తులు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలియజేసి నెమళ్లను అప్పగించినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

మోస్తరు వర్షం

ధరూరు: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం 7గంటల ప్రాంతంలో వర్షం కురువడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో ఇబ్బందులు పడిన జనం.. మళ్లీ వర్షమేందిరా బాబూ అంటూ గుసగుసలాడారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

గట్టు: అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. తపస్ మండల అధ్యక్షుడు పరుశరాం, ప్రధాన కార్యదర్శి రాజుసాగర్ సోమవారం తహసీల్దార్ మహ్మద్ జుబేర్ మొహినుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రమణారెడ్డి, యోగేశ్వర్, రంగస్వామి, సతీష్ పాల్గొన్నారు.

ప్రజాగర్జన సభకు తరలిన బీజేపీ నాయకులు



అయిజ నుంచి బయలుదేరుతున్న నాయకులు



శాంతినగర్ నుంచి..

అయిజ: మహబూబ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాగర్జన సభకు మండలంలోని బీజేపీ నాయకులు బయలుదేరారు. ముందుగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యర్తలు సమావేశమై వాహనాల్లో పాలమూరుకు తరలివెళ్లారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగరాజు, ఓబీసీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు అంజి, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి పరశురాం, బూత్ అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

శాంతినగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ప్రజాగర్జన సభకు వడ్డేపల్లి మండల నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మోహన్, కార్యదర్శి అయ్యరాజు, అంజి, జయన్న పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాల పంపిణీ



భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

గట్టు: మండలంలోని మల్లంపల్లిలో సోమవారం త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక బింగిదొడ్డి ప్రచార కమిటీ ఆధ్వర్యంలో భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్, సభ్యులు లక్ష్మణ్, ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, నర్సమ్మ, పద్మమ్మ, జములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్లతో తాగునీటిని అందించండి



మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

అలంపూర్: మున్సిపాలిటీ ప్రజలకు ట్యాంకర్లతో తాగునీటిని అందించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు కోరారు. ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆశన్నతో కలిసి సోమవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీల కారణంగా నీటి సరఫరా నిలిచిపోతే.. సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం సరికాదన్నారు. మున్సిపాలిటీలో 10 వార్డులు ఉండగా, కేవలం ఒక ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తుండడంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారని తెలిపారు. వ్యాటర్ ట్యాంకర్ల సంఖ్య పెంచి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. 80 గ్రామాలకు తాగునీటిని అందించే మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులపై జాప్యం చేస్తున్నట్లు తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు వెంకటస్వామి, నాగరాజు, సిద్ధయ్య పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

రాజోళి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని ఎంపీపీ మరియమ్మ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, అనారోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు సూచించారు. సమావేశంలో నతానియేల్, రామకృష్ణ, సిద్ధూ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

మల్దకల్: అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మండల కేంద్రంలో సోమవారం పట్టుకొని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇసుకను తరలిస్తున్న లక్ష్మణ్, శివలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.